క్లుప్తంగా

క్షీరాభిషేకం



వర్ధన్నపేట : గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ.వెయ్యి వేతనం పెంచినందుకు మంగళవారం మండలంలోని నల్లబెల్లి పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని వడ్లకొండలో పారిశుద్ధ్యం, పల్లె ప్రగతిలో చేపట్టిన, చేయాల్సిన అభివృద్ధి పనులను మంగళవారం డీఎల్‌పీఓ ప్రభాకర్ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఉపసర్పంచ్ ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి సునీల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య ఆటో యూనియన్ కార్యవర్గం



యాకాంబ్రం, అధ్యక్షుడు

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి క్రాస్ రోడ్ చైతన్య ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం నియమించారు. అధ్యక్షుడిగా మంద యాకాంబ్రం, ఉపాధ్యక్షుడిగా గడ్డం రాజు, కార్యదర్శిగా వన్నాల సతీష్, కోశాధికారిగా మల్లం రమేష్, ముఖ్య సలహాదారులుగా అనుముల సురేష్, మంద వేణు, సభ్యులుగా ఎండి సుభాన్ పాషా, కనుకుల రాజు నియామకం అయ్యారు.

సభకు తరలిన యువకులు



రాయపర్తి : పాలకుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా, యువజన నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి మంగళవారం మండలం నుంచి అధిక సంఖ్యలో యువకులు తరలివెళ్లారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, ముద్రబోయిన సుధాకర్, ఎండీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి



సంగెం : భూమిపై పడిన ప్రతి వర్షపు చినుకును ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా ఏర్పాట్లు చేస్తేనే భవిష్యత్ తరాలకు సరిపడా నీరు లభిస్తుందని నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు వెల్దొండ సురేష్, గాలి భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్ఆర్ఈజీఎస్ కూలీలకు వర్షపునీటి ఆదా ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు తీర్చండి

మడికొండ : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండ–అయోధ్యపురం రోడ్డు టీఎన్‌జీఓఎస్ కాలనీకి చెందిన స్థానికులు మంగళవారం కార్పొరేటర్ మునిగాల సరోజనను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణం, మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం, స్ట్రీట్ లైట్స్ పై ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రభాకర్, సురేందర్, రాము నాయక్, శ్రీకాంత్, అనిల్, కమల్, శ్రీనివాసు పాల్గొన్నారు.

పరిహారం వెంటనే ఇవ్వాలి

ఐనవోలు : అకాల వర్షాలు, వడగళ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.పదివేల నష్ట పరిహారం వెంటనే ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని వాపోయారు. నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు రైతులకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తడిసిన ధాన్యాన్ని, మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా నష్టం వాటిల్లిన రైతులకు కూడా ఎకరాకు రూ.10 వేలు పరిహారం అందించాలని కోరారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోతే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

గుమ్మడి.. నష్టాల దిగుబడి

- నాడు రూ.100.. నేడు రూ.8
- వర్షాలతో ముగిగిపోతున్న కాయలు
- చేలలోనే వదిలిపెడుతున్న రైతులు

దుగ్గొండి : ఇంట్లో కానీ, వేరే ఎక్కడైనా శుభకార్యం అయినా దిష్టి తీయాలన్నా గుమ్మడి కాయ ఉండాల్సిందే. అలాంటి గుమ్మడి కాయలు మూడు, నాలుగేళ్లుగా రైతులకు కాసులు కురిపించాయి. ఈసారి మార్కెట్‌లో ధర తగ్గిపోవడంతో పాటు వడగళ్ల వర్షాలు గుమ్మడి రైతులను నిండా ముంచాయి.

జిల్లాలో గుమ్మడి సాగు దుగ్గొండి మండలంలోనే అధికంగా ఉంటుంది. ఈ సారి రైతులు మండలంలో బూడిద గుమ్మడి, మంచి గుమ్మడిని 120ఎకరాలలో సాగు చేశారు. అయితే తొలుత ధర కాస్తా ఆశాజనకంగానే ఉన్నా రోజు రోజుకు తగ్గిపోయింది. టన్నుకు రూ.10 వేల నుంచి రూ.3వేలకు పడిపోయింది. గతేడాది ఇదే సీజన్‌లో ఒక్కో గుమ్మడి కాయ రిటేల్‌గా రూ.100కు విక్రయించారు. ఈసారి రూ.10కి కూడా అమ్ముడు పోవడం లేదు. దీంతో అన్నదాతలు తలలు పట్టుకున్నారు. కాయలు తెంపి నిల్వ చేసుకుని ధర ఉన్నప్పుడు అమ్ముదామన్నా వడగళ్ల వర్షానికి మొత్తం రంధ్రాలు పడి మురిగిపోయాయి. కనీసం పెట్టుబడి, కూలీ కూడా రాదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు మంచి గుమ్మడి కాయలను చేలలోనే వదిలిపెడుతున్నారు. తొగర్రాయి గ్రామానికి చెందిన కొత్తపెల్లి తిరుపతి రెండు ఎకరాలలో మంచి గుమ్మడి కాయలు సాగు చేయగా 20టన్నుల దిగుబడి వచ్చే విధంగా కాయలు కాశాయి. తీరా వడగళ్లతో కాయలన్నీ మురిగిపోయాయి. దీంతో సదరు రైతు గుమ్మడి కాయలను చేలలోనే వదిలివేశాడు. బూడిద గుమ్మడి కాయలను చేలో నుంచి బయటికి తెచ్చి నిరుపయోగ గుంతలలో పారబోస్తున్నారు.



తొగర్రాయిలో రైతు కొత్తపెల్లి తిరుపతి చేనులో వదలేసిన గుమ్మడి కాయలు



ఎకరం సాగు చేశా..



నేను ఎకరం భూమిలో బూడిద గుమ్మడి సాగు చేశా. నాలుగు నెలల క్రితం రెండు టన్నులు కోసి అమ్మితే రూ.15 వేలు వచ్చాయి. ఇంకా 8 టన్నుల వరకు అవుతుంది. మార్కెట్‌లో ధర తగ్గిపోయింది. అక్కడికి తీసుకెళ్తే రవాణా చార్జీలు సైతం వచ్చే పరిస్థితి లేదు. గతంలో చాలా మంది రైతులకు మంచి లాభాలు వచ్చాయని నేను సాగు చేసి నిండా మునిగా.. ప్రభుత్వం నష్టపరిహారం వర్తింపజేసి ఆదుకోవాలి.

–కొక్కరకొండ రమేష్, గిర్నిబావి

మురుగు కాల్వ నిర్మించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ వాడలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగు నీరు నిత్యం రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బూర రామన్న, మేడిపల్లి ఐలయ్య, నర్సయ్య, రావుల రాజు, గాదెగాని రమేష్ ఎల్లస్వామి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధనాసక్తిని పెంచాలి



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థులు

వర్ధన్నపేట : విద్యార్థుల్లో పరిశోధనాసక్తిని పెంచేందుకు ప్రతి ఏటా జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు పోటీలను నిర్వహిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలోని పొలిటికల్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు చేసిన కోవిడ్–19 పరిస్థితుల్లో స్త్రీలపై గృహహింస, ఒక పరిశీలన అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గెలుపొందిన బృందంలోని ప్రతి విద్యార్థికి మంగళవారం ప్రథమ బహుమతి రూ.6 వేలు, పర్యవేక్షకులకు రూ.5 వేలు కళాశాల విద్యాశాఖ అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థుల పరిశోధనలకు సరైన సహకారం పర్యవేక్షణ ఇచ్చినట్లయితే పరిశోధన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. తద్వారా మంచి పరిశోధనలు ఆవిష్కరించబడతాయన్నారు. రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు ఎంపికైనందుకు పర్యవేక్షకులు, అధ్యాపకులు డాక్టర్ బి.కవితను అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి కళాశాలకు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అప్పారావు

వర్ధన్నపేట : పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీపీ అన్నమనేని అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నారం, ఉప్పరపల్లి, నల్లబెల్లి, చంద్రుతండా, కదారిగూడెం, బండౌతపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమాల్లో భిక్షపతి, కమ్మగోని స్వామిరాయుడు, కొడగాని రాజేశ్‌ఖన్నా, గుజ్జ గోపాల్‌రావు, కుమారస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పలకల పంపిణీ



నల్లబెల్లి : మండలంలోని లెంకాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అదే గ్రామానికి చెందిన గుండె యుగేందర్ పలకలు వాటర్ బాటిల్స్ మంగళవారం పంపిణీ చేశారు. అలాగే ఎస్ఎంసీ చైర్మన్ మోటపోతుల నరేష్ నాలుగు కుర్చీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆకుల సునీత, ఎండీ సుల్తానా బేగం, ఆశవర్కర్లు బయ్య రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా



సభ వాయిదాను ప్రకటిస్తున్న ఎంపీపీ విజేందర్

చెన్నారావుపేట : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసే మండల సర్వసభ్య సమావేశం కోరం లేక మంగళవారం వాయిదా పడింది. ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బాదావత్ విజేందర్ మాత్రమే హాజరయ్యారు. 11మంది ఎంపీటీసీలకు ఒక్క ఎంపీటీసీ కూడా మండల సభకు హాజరు కాలేదు. 30మంది సర్పంచ్‌లకు నలుగురు మాత్రమే వచ్చారు. ఆయా శాఖల చెందిన అధికారులు మాత్రం సభకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12:30దాటిన మండల సభకు పూర్తి స్థాయిలో కోరం లేకపోవటంతో మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ విజేందర్ ప్రకటించారు. మండల సర్వసభ్య సమావేశం మళ్లీ ఎప్పుడు నిర్వహించే సమయాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ భారతి, ఏపీఓ అరుణ, ఆర్‌డబ్ల్యూ ఏఈ మంగీలాల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుండె మల్లయ్య, తప్పెట రమేష్, సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

'స్ట్రీట్ వెండర్లకు ఆర్థిక భరోసా'

నర్సంపేట : విధి వ్యాపారుల కోసం ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసిన స్ట్రీట్ వెండర్ స్కీమ్ పథకాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.10వేలతో మొదలైన ఈ పథకం ఇప్పుడు వ్యాపారులు రూ.50వేల వరకు రుణం తీసుకోవచ్చన్నారు.ప్రజా వ్యవస్థలో పండ్లు అమ్ముకునే వారు, కుట్టుమిషన్, పాన్ షాప్, వివిధ వ్యాపారాలు కరోనా సమయంలో స్తంభించి నష్టపోయిన ప్రజల కోసం స్ట్రీట్ వెండర్స్ పథకం ఇది వరకు తీసుకున్న వారు సక్రమంగా చెల్లించిన వారు రూ.20వేల నుంచి రూ.30, రూ.50వేల వరకు తిరిగి పొంది ఆర్థికంగా వీధి వ్యాపారాలు చేసుకోవాలన్నారు. విధి వ్యాపారులు మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆశ కార్యకర్తలకు దుస్తులు..



చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలకు మంగళవారం ఈజీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు గ్రామాలల్లో చేసిన సేవలను గుర్తించి దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, నూకల కృష్ణయాదవ్, వనపర్తి మల్లయ్య, గంగిడి మౌనిక్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, అనిల్ నాయక్ తదితరులు ఉన్నారు.

షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఐనవోలు : తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా త్వరగా కొనుగోలు చేసి రైతుల కష్టాలను తీర్చాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేష్‌గౌడ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మెట రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంథిని గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకుల బృందం సందర్శించింది. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంథిని గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ప్రారంభించి పది రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని దుయ్యబట్టారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు పార్టీ సమావేశాల్లో పాల్గొనేందుకు సమయం ఉంటుంది కానీ, రైతుల ధాన్యాన్ని కాంటాలు వేయించి మిల్లులకు తరలించే తీరిక లేకుండా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆరుగాలం కష్టపడి రెక్కాడితే గాని డొక్కాడని రైతుల గోసను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు రైతుల కష్టాలు కంటికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఈ సందర్భనలో నాయకులు మడూరి మల్లేశం, మడూరి చిన్న రాజు, సంజీవ, బండి రమేష్, సట్ల రాజు, తాళ్లపెల్లి రాజు, రైతులు రవీందర్, కొమురయ్య, రమేష్, రాజు, మహిళా రైతులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో అభయాంజనేయస్వామి సహిత శివాలయంలో లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగదేవత, నవగ్రహ దేవతామూర్తులు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్, ఉపసర్పంచ్ కరుణాకర్, వార్డు సభ్యులు మాధవి, మమత, లక్ష్మి, రాజేంద్రప్రసాద్, యాకయ్య, ప్రవీణ్, జనార్ధన్, లింగమూర్తి, సురేశ్, పురోహితులు రాజు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నల్లబెల్లి : ప్రభుత్వ నిబంధనలు పాటించని బెల్టుషాపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు పరికి కొర్నేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్న బెల్టుషాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు సాంబయ్య, బొమ్మకంటి అనిల్, రమేష్, సమ్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



నల్లబెల్లి: శోభాయాత్రలో హనుమాన్ మాలధారులు, భక్తులు

నల్లబెల్లి : మండల కేంద్రంలో హనుమాన్ భక్తులు అంజనేయుడి చిత్రపటంతో మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రామ, హనుమ సంకీర్తనలు పాడుతూ, భజన చేస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు కొత్తపల్లి రాం నర్సయ్య, మామిండ్ల వీరారెడ్డి, ఊదరు రాజు, కిరణ్, రాజు, ఒదేలు, రాజన్న పాల్గొన్నారు.

5న నగర సంకీర్తన, శోభాయాత్ర



నర్సంపేట: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీన నగర సంకీర్తన, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు నల్ల మనోహర్‌రెడ్డి, నాగెల్లి వెంకట్ నారాయణగౌడ్‌లు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో మంగళవారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర సంకీర్తన, శోభాయాత్రకు భక్తులు, ఆంజనేయ స్వామి మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

హామీలను అమలు చేసే వరకూ సమ్మె



సంగెం: నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు



గీసుకొండ: సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు

ఖానాపురం : సీఎం కేసీఆర్ తమకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ సమ్మె కొనసాగుతుందని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సమ్మెకు పంచాయతీ కార్మికులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పోశాల యుగేందర్, సుధాకర్, కాసుల రాంబాబు, సోని, అబేద, ఉష, బాలు, హుస్సేన్, పంచాయతీ కార్మికులు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులు చేతులపై రాసుకుని..

సంగెం : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఓపీఎస్‌లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తు మండల కేంద్రంలో ఐదో రోజు నిరసన చేపట్టారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు సమ్మెలో భాగంగా ఇన్నాళ్లు తాము చేసిన పనులు చేతులపై రాసుకుని, వారి పిల్లలతో కలిసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. రెగ్యులర్ చేయడంతో పాటుగా నాలుగేళ్ల సర్వీస్‌ను కలిపి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు రమేష్, స్వప్న, కళ్యాణి, వాజీద్, అశోక్, సందీప్, సతీష్, నాగరాజు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం: సంఘీభావం తెలుపుతున్న జీపీ కార్మికులు



సంగెం: చేసిన పనులను చేతులపై రాసుకుని నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

కొనసాగుతున్న సమ్మె

గీసుకొండ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరింది. 'పల్లె ప్రగతి.. మేం అధోగతి', 'పల్లెలు పచ్చబడ్డాయి.. మా జీవితాలు రోడ్డున పడ్డాయి', అంటూ ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. శారద,నరేశ్, సహజ, తపస్విని, రమ్య, రంజిత్, మహేశ్, ప్రశాంత్, చిత్తరంజన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్సంపేట : పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 2006–07సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు కప్పి జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బని శివ, ఉగ్గిడి నాగార్జున, గాదం ప్రదీప్, వైనాల రాజు, వైనాల రాజేష్, కొండి రాజేష్, కక్కెర్ల మౌనిష్, వేముల ప్రశాంత్, వంగ సీరజ, అక్కపెల్లి కీర్తన, ఏడుకొండ స్వాతి, ఉడ్డుల మానసన, శ్వావ్య, మౌనిక, హరిప్రియ, మౌనిక, ప్రియాంక, ఉపాధ్యాయులు బెజ్జంకి వీరబ్రహ్మచారి, శ్యామ్ భూపాల్, రమేష్, హేమలత, రమాదేవి, శ్రీలత పాల్గొన్నారు.